క్లుప్తంగా

95వ రోజుకు చేరిన అఖండ హోమం



నాగ సాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అక్షయ పాత్ర ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని ఆదిశేష నిలయంలో గౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 108 రోజుల అఖండ హోమం, అఖండ దీప సముఖంలో నాగ సాధన కార్యక్రమం బుధవారం 95వ రోజుకు చేరుకుంది. నాగ సాధన, నాగ ప్రతిష్ఠ, సర్ప జప, సర్ప హోమాది క్రతువులను నిర్వహించారు. అక్షయ పాత్ర ప్రతినిధి, గౌతమ మహర్షి గో సంరక్షణ సమితి గోశాల సేవకుడు చాగంటి వరప్రసాద్, నందు దంపతులు ఈ క్రతువులను నిర్వహించారు.

అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు



యాగశాలలో పూజలు చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: జార్జిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మి అమ్మవారి ఆలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా పలువురు దంపతులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. బుధవారం వేద పండితులు వాడపల్లి గోపాలచార్యులు నేతృత్వంలో స్వస్తి వాచకం, విష్వక్సేన పూజ, పవిత్రోత్సవం, దీక్షా ధారణ తదితర పూజలు నిర్వహించి యాగ శాల ప్రవేశం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వేలం పాట నిర్వహించక ఆదాయానికి గండి

యానాం: మార్కెట్ ఆశీలు వేలం పాట నిర్వహించక మున్సిపాలిటీ లక్షల్లో ఆదాయం కోల్పోతుందని, వెంటనే వేలం పాట నిర్వహించాలని కోరుతూ బుధవారం స్థానిక నాయకులు సబ్బతి శ్రీనివాస్, పెసల వెంకటేష్, కాదా పవన్, హరిప్రసాద్ తదితరులు కమిషనర్ కె.రామకృష్ణకు విజ్ఞప్తి చేశారు. గతంలో ఏడాదికి రూ.8.30 లక్షల ఆదాయం మున్సిపాలిటీకి వచ్చేదన్నారు. ఈ ఏడాది వేలం పాట రూ.24 లక్షలకు దక్కించుకున్న వ్యక్తి 4 నెలలు వసూలు చేసుకుని అర్థాంతరంగా తప్పుకున్నాడని, అప్పటి నుంచి వేలం పాట నిర్వహించడం లేదన్నారు. అందుకే త్వరితగతిన మార్కెట్ ఆశీలు వేలం పాట నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

శివారు ప్రాంతాలకు సాగు నీరందించాలి

తాళ్లరేవు: శివారు ప్రాంతాల్లోని వరి చేలకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందించాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కౌలు రైతు సంఘం ప్రతినిధులతో కలిసి తాళ్లరేవు మండలంలో నీటి ఎద్దడి ఉన్న చొల్లంగి, గ్రాంటు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ఎండిపోయిన వరి చేలకు పంటల బీమాతో పాటు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, స్వర్ణ రాజు, శ్రీపాదం సత్యనారాయణ, పిల్లి వీరనాగు, పలివెల ఏడుకొండలు తదితరులున్నారు.

వెండి కిరీటం సమర్పణ



సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అలంకరిస్తున్న వెండి కిరీటం

అమలాపురం రూరల్: పాత బండారులంక గ్రామంలో ఉన్న భువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వర ఆలయంలో వల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి బండారులంకకు చెందిన నల్లా అప్పారావు దంపతులు రూ.15 వేల విలువైన వెండి కిరీటం, వెండి నాగాభరణం సమర్పించారు. ఆలయ పురోహితులు బళ్ల నాగ దుర్గాప్రసాద్, నల్లా అప్పారావు స్వామికి విశేష పూజలు చేశారు.

ఆర్‌ఏఓ ఆఫీసు సూపరింటెండెంట్‌గా పెసల

యానాం: యానాం రీజనల్ అడ్మినిస్ట్రేటర్ ఆఫీసు సూపరింటెండెంట్‌గా పెసల ఓమ్‌నమ శ్శివాయంను నియమిస్తూ బుధవారం పుదుచ్చేరి పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ వింగ్ కార్యదర్శి వి.జయశంకర్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత సూపరింటెండెంట్ మల్లిఖార్జునరావును జీజీహెచ్‌కు బదిలీ చేశారు. అసిస్టెంట్ గెద్దం పెదబాలయోగి పదోన్నతిపై డిప్యూటీ కలెక్టర్‌గా రెవెన్యూ విభాగంలో నియమించారు.

కార్డు చిన్నది.. ప్రయోజనం పెద్దది

- మాతాశిశు సంరక్షణ కార్డులతో ఎన్నో ఉపయోగాలు
- గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు
- బిడ్డకు వేయాల్సిన టీకాల గురించి సమగ్ర సమాచారం



మాతాశిశు సంరక్షణ కార్డు

ముమ్మిడివరం: మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ఏఏ వైద్య పరీక్షలు ఎప్పుడెప్పుడు చేయించుకోవాలి? సుఖ ప్రసవం అయ్యేందుకు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి? ఎటువంటి ఆహారం తీసుకోవాలి? బిడ్డ పుట్టాక ఎప్పుడెప్పుడు ఏఏ వ్యాక్సిన్లు వేయించాలి?.. ఇలా గర్భిణులకు, బాలింతలకు ఎన్నో సందేహాలు వస్తుంటాయి. అందుకే ప్రభుత్వం వారికి ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించేందుకు సమస్త వివరాలు తెలియజేస్తూ మాతాశిశు సంరక్షణ(ఎంసీపీ) కార్డుల్ని అందిస్తుంది. కార్డు చిన్నదైనా దాన్ని వల్ల కలిగే ప్రయోజనాలు అన్నీఇన్నీ కాదని వైద్యనిపుణులు చెబుతున్నారు.

బహుళ ప్రయోజనాలు

ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ఆరోగ్య ఉపకేంద్రాలు, జిల్లా ఆసుపత్రుల్లో గర్భిణులకు జిల్లా వైద్యారోగ్య శాఖ మాతాశిశు సంరక్షణ కార్డుల్ని పంపిణీ చేస్తుంది. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి కాన్పు పూర్తయ్యే వరకూ ప్రభుత్వ వైద్యశాలలో నాలుగుసార్లు వైద్యసేవలు తప్పనిసరిగా చేయించుకోవాలి. ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్య పరీక్షలకు వెళ్లే ప్రతిసారి గర్భిణులు, బాలింతలు వైద్యాధికారులకు ఎంసీపీ కార్డులు చూపించాల్సి ఉంటుంది. గర్భిణి వైద్య చరిత్ర, హిమోగ్లోబిన్ శాతం, వారికిస్తున్న మందులు, బిడ్డ ఎదుగుదలను నిగ్గు తేల్చే స్కానింగ్ వివరాలు, గర్భం దాల్చిన తేదీ, ప్రసవ తేదీలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, కాన్పు జరిగిన తరువాత ఐదేళ్ల వయసు వరకూ బిడ్డకు ఎప్పుడెప్పుడు ఏఏ వ్యాక్సిన్లు వేయాలన్న సమస్త వివరాలు మాతాశిశు సంరక్షణ కార్డుల్లో నమోదు చేస్తారు. ప్రధానమంత్రి మాతృవందన యోజన, జననీ సురక్ష యోజన, ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ తదితర పథకాల ద్వారా ప్రసవం తరువాత ఇచ్చే పోత్సాహక వివరాలు సైతం ఈ కార్డులో పొందుపరుస్తారు. అంతేకాదు మహిళల్లో ఎక్కువగా కనిపించే గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ కు సంబంధించి ప్రాథమిక లక్షణాలను సైతం ఈ కార్డులో పొందుపరుస్తారు. ఈ కార్డుల్ని సక్రమంగా ఉపయోగించుకుంటే గర్భిణులు, మహిళలు తమతో పాటు తమ శిశువుల ఆరోగ్యాన్ని సంరక్షించుకోవొచ్చు.

ముమ్మిడివరం ఐసీడీఎస్ పరిధిలోని మండలాల్లో గర్భిణులు, చిన్నారుల వివరాలు

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు, బాలింతలు	చిన్నారులు
ముమ్మిడివరం	71	599	2042
కాట్రేనికోన	102	961	3277
ఐ.పోలవరం	70	817	2648
అయినవిల్లి	70	676	2026

ఎంసీపీ కార్డుతో ప్రయోజనాలెన్నో

మాతా శిశు సంరక్షణ(ఎంసీపీ) కార్డుల వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి. తల్లి ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు బిడ్డలకు ఐదేళ్లు వచ్చే వరకూ ఇవ్వాల్సిన వ్యాక్సిన్ల వివరాలుంటాయి. దీంతో పాటు బిడ్డ వయసు, ఎత్తు, బరువుల వివరాలు కార్డులో చార్ట్ రూపంలో ఎప్పటికప్పుడు నమోదవ్వడం వల్ల ఏవైనా లోటుపాట్లుంటే వైద్యులకు సులువుగా అర్థమవుతుంది.

– డాక్టర్ బి.వినీల్, వైద్యుడు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కొత్తలంక



యూజర్ చార్జీలు విధిగా చెల్లించాలి

మున్సిపల్ కమిషనర్ నాయుడు



తమ నివాసం వద్ద వలంటీర్‌కు యూజర్ చార్జీలు చెల్లిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాయుడు

అమలాపురం టౌన్: పట్టణంలోని ప్రతి గృహస్తుడు, వాణిజ్య సముదాయ యాజమాని తప్పనిసరిగా యూజర్ చార్జీలు చెల్లించి క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు సూచించారు. స్థానిక మున్సిపల్ పిల్లల పార్కు వద్ద ఉన్న తన క్వార్టర్స్(నివాసం)కు సంబంధించి కమిషనర్ నాయుడు ఆ ప్రాంత వలంటీర్ లక్ష్మికి యూజర్ చార్జీలను బుధవారం చెల్లించారు. పట్టణంలో ప్రతి ఒక్కరూ మీ పరిసరాలు, పట్టణ పరిశుభ్రత కోసం పారిశుధ్య విభాగానికి సహకరిస్తూ యూజర్ ఛార్జీలు చెల్లించాలని సూచించారు.

జాతీయ సేవా దళానికి దరఖాస్తుల ఆహ్వానం

యానాం: యానాం నెహ్రూ యువ కేంద్రంలో యువజన, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో సేవా భావంతో జాతీయ సేవాదళం కార్యకర్తలుగా పనిచేయడానికి యానాంకు చెందిన ఆసక్తి గల యువతీ యువకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువ సమన్వయ అధికారి టి.గోపి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్హత, 18–29 ఏళ్ల వయసున్నవారు అర్హులన్నారు. ఇంటర్వ్యూ ద్వారా ఎంపికైన వారు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యుజవన చైతన్య సదస్సులు నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. ఎంపికైన వారికి నెలకు రూ.5 వేలు చొప్పున ఇస్తారన్నారు. వివరాలకు 97005 14536 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

వైభవంగా శేష వాహనోత్సవం



శేష వాహనోత్సవంలో ఎమ్మెల్యే అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు

యానాం: యానాంలో కొలువైన భూసమేత వేంకటేశ్వర స్వామివారి కల్యాణమహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి గిరివెంకటమాధవరావు కుమారులు ఉత్సవదారులుగా జరిగిన శేషవాహనోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన శేషవాహనంలో స్వామివారిని పుర వీధుల్లో ఊరేగించారు. ముందుగా శేషవాహనం వద్ద ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏఓ మునిస్వామి, డీటీ సత్యనారాయణన్, మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ తదితరులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం అందరినీ ఆలరించింది. కార్యక్రమంలో రిటైర్డ్ పుదుచ్చేరి ఉన్నతాధికారి గిడ్డి బలరామ్, కాటంశెట్టి రామ్మూర్తి, పడాల గోపాలం, ఎస్ఆర్ఎమ్‌టి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంజన్లతో తోడి.. అడ్డుకట్టలు వేసి..



పి.మల్లవరం పంట కాలువ వద్ద ఇంజన్లతో నీటిని తోడిస్తున్న తహసీల్దార్ పోతురాజు



కోరంగి పంచాయతీలో మాలకాలువకు వేస్తున్న అడ్డుకట్ట

సాగునీటి సరఫరాకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు

తాళ్లరేవు: శివారు ప్రాంతాల్లో సాగునీటి సమస్యపై అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. మండల పరిధిలోని పలు గ్రామాల్లో నెలకొన్న సాగునీటి సమస్యపై రైతులు ఆందోళన బాట పట్టారు. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయి అధికారుల బృందం సాగునీటి ఎద్దడి నెలకొన్న శివారు ప్రాంతాల్లో పర్యటించి పరిష్కార చర్యలను సూచించారు. జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, కాకినాడ ఆర్డీఓ బీవీ రమణ ఆదేశాల మేరకు సాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. రెవెన్యూ, ఇరిగేషన్, డ్రైనేజీ శాఖల పర్యవేక్షణలో ఇంజన్లతో నీటిని ఎత్తిపోతల ద్వారా కాలువల్లోకి తోడడంతో పాటు పలు చోట్ల నీటిని నిల్వ చేసేందుకు అడ్డుకట్టలు వేస్తున్నారు. మండల పరిధిలోని మల్లంకోట సైఫన్ వద్ద ఇంజన్లను ఏర్పాటు చేసి నీటిని ప్రధాన పంట కాలువల్లోకి తోడుతున్నారు. కోరంగి పంచాయతీలోని మాలవారి కాలువ, పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది, ఉప్పంగల, సుంకరపాలెంలలో అడ్డుకట్టలు వేస్తున్నారు. నీలపల్లి కాలువలో పూడికతీత పనులను చేపట్టారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రత్తిగొంది మూడుతూముల కాలువ వద్ద కాంక్రీట్ బండ్ వద్ద మూడు మోటార్లను ఏర్పాటు చేసి నీటిని ఎత్తిపోస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.పోతురాజు తెలిపారు. గ్రాంటు పరిధిలో ఐదు మోటార్లతో లిఫ్ట్ చేస్తున్నామన్నారు. సాగునీటి సమస్య పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మార్చి 9న పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశం

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశం మార్చి 9న నిర్వహించనున్నట్లు అసెంబ్లీ కార్యదర్శి జె.దయాలన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సభకు ఎల్జీ తమిళిసై సౌందరరాజన్ హాజరవుతారన్నారు. ఈ మేరకు తనకు సమాచారం అందిందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు.

కార్మికులకు నిధులు కేటాయించకపోవడం దారుణం

అమలాపురం రూరల్: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మిక వర్గానికి ఎటువంటి నిధులు కేటాయించకపోవడం దారుణమని సీఐటీయూసీ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక ఎంప్లాయిస్ హోమ్ వద్ద మండల సీఐటీయూసీ అనుబంధ ప్రజాసంఘాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 3వ తేదీన ఛలో ఢిల్లీ పిలుపును జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సువర్ణ, బి.మణిమాల, కుడుపూడి దుర్గ, డి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నారాయణ కళాశాలపై విచారణ జరిపించాలి

డీఆర్వోకు ఏబీవీపీ ఫిర్యాదు

అమలాపురం టౌన్: అమలాపురం నారాయణ కళాశాల యాజమాన్యం ప్రాక్టికల్స్ చూసి రాయిస్తామని చెప్పి ఒక్కో విద్యార్థి నుంచి రూ.1,000 వసూలు చేస్తోందని ఏబీవీపీ ప్రతినిధులు డీఆర్వో సీహెచ్ సత్తిబాబుకు ఫిర్యాదు చేశారు. తాము ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన డీఆర్వో సత్తిబాబు డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి(డీఐఈవో)కు ఫోన్ చేసి నారాయణ కళాశాలలో తాము లేవనెత్తిన సమస్యపై మాట్లాడారని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలు విలేకరులకు తెలిపారు. అధికారులు నారాయణ కళాశాలపై సమగ్ర విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఆర్వోకు ఫిర్యాదు చేసినవారిలో ఏబీవీపీ ప్రతినిధులు చందు, గణేష్, మురళీ, మహేష్ తదితరులున్నారు.

సామాజిక సేవలో స్కౌట్స్, గైడ్స్ కీలకపాత్ర

యానాం: సామాజిక సేవలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కీలపాత్ర పోషిస్తున్నారని నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు అన్నారు. బుధవారం స్కౌట్ ఉద్యమ వ్యవస్థాపకుడు లార్డ్‌బెడన్ పౌల్ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచ స్కౌట్స్ అండ్ గైడ్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్, గైడ్ టీచర్‌లు పాపారావు, ఉషారాణి విద్యార్థులచే స్కౌట్ ప్రమాణాన్ని చేయించారు. విద్యార్థులు శివాజీ, మనోజ్ఞ థింకింగ్ డే గురించి చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో టీచర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓఎన్‌జీసీ పరిహారమివ్వాలి

యానాం: ఓఎన్‌జీసీ సంస్థ కేజీ బేసిన్ నుంచి పి.మల్లవరం వరకు వేస్తున్న గ్యాస్ పైపులైను వల్ల వేట నష్టపోతున్న మత్స్యకారులకిచ్చే పరిహారం అర్హులందరికీ అందజేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అధికారులను కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సర్వేలే ప్రామాణికం కాకుండా నష్టపోతున్న వారిని గుర్తించి పరిహారాన్ని మంజూరు చేయాలన్నారు. మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం తాను ఏ పోరాటానికైనా సిద్ధమని చెప్పారు.

ఓఎన్‌జీసీ వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని గోపవరం గ్రామంలో బుధవారం ఓఎన్‌జీసీ వాహనాలకు ప్రవేశం లేదని గ్రామస్తులు అడ్డుకుని నిరసన చేపట్టారు. గత 30 ఏళ్లగా తమ గ్రామం నుంచి చమురు తరలించుకుపోతున్నా, ఓఎన్‌జీసీ అధికారులు ఇచ్చిన హామీలు కలగానే మిగిలిపోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి గ్రామంలో రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణాలు చేపట్టి గ్రామాభివృద్ధికి సహరించాలని కోరారు. గ్రామంలో అభివృద్ధి జరిగిన తరువాతే వాహనాలను అనుమతిస్తామని హెచ్చరించారు.

ఉపాధి పనులను పరిశీలించిన సర్పంచ్

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి పంచాయతీ పరిధిలో జరుగుతున్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పనులను సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ బుధవారం పరిశీలించారు. కూలీల హాజరుతో పాటు పనులు జరిగే విధానాన్ని, వేతనాలను ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.ధనలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పరమట సాయిబాబు, జొన్నాడ చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నాలుగో వార్షికోత్సవం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు కేశవ స్వామి బైపాస్ కాలనీలో ఉన్న విజయ కనకదుర్గాదేవి అమ్మవారి ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితులు వేద పారాయణ, మహా చండీయాగం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాల ముగింపు

మురమళ్లలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఊరేగింపు

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారి మహాశివరాత్రి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. బుధవారం ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి మేళ తాళాలు, కేరళ వాయిద్యాలు, బ్యాండ్ మేళాలతో ఊరేగింపుగా భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. వృద్ధ గౌతమీ గోదావరి వద్ద గోదావరి మాతకు ఆలయ పురోహితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి, వేదపండితుడు గంటి సుబ్రహ్మణ్యశాస్త్రి, ఆలయ అర్చకులు యనమండ్ర సుబ్బారావు, ఉండి దత్తు తదితర పండితులచే పంచ హారతులు, పుష్కర ఘాట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా స్వామి వారిని, అమ్మవారిని పచ్చిపూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వీరేశ్వరస్వామిని దర్శించుకుంటున్న మంత్రి విశ్వరూప్

వీరేశ్వరుని దర్శించుకున్న మంత్రి విశ్వరూప్

మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ, అర్చకులు స్వాగతం పలికారు. మంత్రి విశ్వరూప్ స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మంత్రికి స్వామి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

ఘనంగా వీరేశ్వరుని తెప్పోత్సవం



గౌతమీ గోదావరిలో విహరిస్తున్న భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి



గోదావరి మాతకు హారతులు ఇస్తున్న పండితులు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్

ఐ.పోలవరం: పార్వతీ పరమేశ్వరుల నదీ విహార మహోత్సవం అంబరాన్ని తాకింది. మహా శివ రాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన బుధవారం తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై వీరేశ్వరుడు, భద్రకాళీ అమ్మవార్లు విహరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పాల్గొని గోదావరి మాతకు పంచ హారతులు ఇచ్చారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ దంపతులు పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని మ్యాప్‌లో పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, తహసీల్దార్ ప్రసాద్

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని అమలాపురం టౌన్ ప్రజలకు నిర్మించిన టిడ్కో భవనాల నుంచి వచ్చే వ్యర్థ జలాలను బయటకు మళ్లించేందుకు డ్రెయిన్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, అల్లవరం తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఇటీవలే జేసీ టిడ్కో భవనాలను పరిశీలించి ప్రభుత్వ భూమిలోనే డ్రెయిన్ నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని సేకరించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో మరోసారి అధికారులు పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో టిడ్కో డీఈ పి.రాజు, డ్రెయిన్స్ ఏఈ ఎంవీవీ కిషోర్, సునీత, ఏఓ ఎన్‌వీవీ సత్యనారాయణ, సర్వేయర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఇజ్రాయిల్‌ని కలిసిన సర్పంచ్‌ల సమాఖ్య



ఇజ్రాయిల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచ్‌ల సమాఖ్య

అల్లవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థి బొమ్మి ఇజ్రాయిల్‌ని గోడిలోని ఆయన నివాసంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇజ్రాయిల్‌ని కలిసినవారిలో సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకటరావు, తిక్కిరెడ్డి శ్రీనివాసరావు, దాకారపు చిరంజీవిరావు, రాయుడు విష్ణు, రొక్కాల విజయలక్ష్మి, తోట శ్రీదేవి తదితరులున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై కాపు నేతల హర్షం

మామిడికుదురు: కోనసీమ జిల్లా శెట్టిబలిజ వర్గం నుంచి కుడుపూడి సూర్యనారాయణరావు, మాదిగ కులానికి చెందిన బొమ్మి ఇజ్రాయిల్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా వైఎస్సార్ సీపీ ప్రకటించడంపై పార్టీకి చెందిన కాపు నేతలు హర్షం తెలిపారు. స్థానికంగా బుధవారం జరిగిన సమావేశంలో పార్టీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి మంగెన సింహాద్రి, ఎంపీపీ వీర మల్లిబాబు, పార్టీ నేతలు రావి ఆంజనేయులు, అడబాల బ్రహ్మాజీ, బొలిశెట్టి భగవాన్, సూరిశెట్టి బాబి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా సామాజిక న్యాయం పాటిస్తూ అన్ని వర్గాలకు ప్రాతినిథ్యం కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సమావేశంలో బండారు కాశీ, కూనపరెడ్డి రాంబాబు, కుంపట్ల చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

నెలరోజుల్లో డంపింగ్ యార్డు నిర్మిస్తాం



మాచవరంలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ కృష్ణకుమారి

అంబాజీపేట: ఏళ్ల తరబడి నెలకొన్న డంపింగ్ సమస్యను నెలరోజుల్లో పరిష్కరించి డంపింగ్ యార్డును నిర్మిస్తామని డీపీఓ ఎం.కృష్ణకుమారి అన్నారు. మాచవరం పంచాయతీ పరిధిలోని హడ్కోకాలనీ, మాచవరంలో ఉన్న డంపింగ్ యార్డులను బుధవారం పరిశీలించారు. డీపీఓ మాట్లాడుతూ హడ్కోకాలనీ శివారు స్మశాన వాటికలో చెత్తతో పాటు వ్యర్థాలను పడవేయడం వల్ల దుర్వాసన వెదజల్లి, రోగాల బారిన పడుతున్నామని స్పందనలో ఫిర్యాదు చేశారన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డంపింగ్ యార్డును పరిశీలించి సమస్యను పరిష్కరించేలా గ్రామస్తులతో చర్చించామన్నారు. మాచవరంలో నిర్మించిన చెత్త నుంచి సంపద సేకరణ కేంద్రం నిరుపయోగం మారిందని దానిని పంచాయతీ అధికారులు, పాలక వర్గం పట్టించుకోకుండా వదిలేశారన్నారు. తడి, పొడి చెత్తలను వేరే చేసి యార్డులో ఉంచేలా మరిన్ని గోళాలు నిర్మించాల్సి ఉందన్నారు. డంపింగ్ యార్డు నిర్మాణానికి కావాల్సిన 15 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని చూడాలని ఇన్‌చార్జి తహసీల్దార్ రియాజ్ హుస్సేన్‌ను చెప్పారు. అనుకూలమైన స్థలం ఏర్పడే వరకూ కాలనీలో శివారు శ్మశాన వాటికలో రెండు, మాచవరంలో రెండు ట్రాక్టర్‌ల చెత్తను వేస్తారని అందుకు ప్రజలు సహకరించాలని డీపీఓ కోరారు. దాంతో ఇరువురు అంగీకరించి నెల రోజుల్లోగా డంపింగ్ యార్డును నిర్మించి కాలనీల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బి.మమత, ఆర్ఐ ఎండీ.ఇబ్రహీం, స్థానిక నాయకులు నాగాబత్తుల సుబ్బారావు, ఉందుర్తి నాగబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో వైద్య సేవలు



మామిడికుదురులో వైనతేయం నాయుడు దంపతులను సత్కరిస్తున్న డాక్టర్లు

మామిడికుదురు: ప్రజలకు సేవ అందించాలన్న దృక్పథంతో డాక్టర్ వడ్డే వైనతేయం నాయుడు 52 ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలందించి వారి మన్ననలు అందుకున్నారని ప్రముఖ డాక్టర్లు త్సవటపల్లి సత్యనారాయణ మూర్తి, బసవా వరహాలు పేర్కొన్నారు. అయిదు దశాబ్దాల పాటు మామిడికుదురు పరిసర గ్రామాల ప్రజలకు వైద్య సేవలందిస్తున్న వైనతేయం నాయుడుకు స్థానికులు బుధవారం పౌర సన్మానం ఏర్పాటు చేశారు. ఈ సభకు రిటైర్డ్ హెచ్‌ఎం యెరుబండి లక్ష్మయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మూర్తి, వరహాలు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా భావించిన వైనతేయం నాయుడు ఎంతో మందికి వైద్య సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైనతేయం నాయుడు దంపతులకు పుష్పగుచ్చాలు అందించి వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్లు కె.సీతారామారావు, కడలి సత్యనారాయణ, బోణం నాగేశ్వరరావు, జెడ్పీటీసీ కొనిరెడ్డి ఆంజనేయులు, వలవల బాబ్జి పాల్గొన్నారు.